క్లుప్తంగా

డీఎస్సీలో సత్తాచాటిన రైతు కూలీబిడ్డ


ఎం.నిఖిల్

శెట్టూరు: ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ముచ్చర్లపల్లికి చెందిన రైతుకూలీ ఉప్పర ఆంజనేయులు కుమారుడు ఎం. నిఖిల్ సత్తాచాటాడు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో (స్కూల్ అసిస్టెంట్) 34వ ర్యాంకు సాధించాడు. గ్రామస్తులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు నిఖిల్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

టీచర్ పోస్టుకు సచివాలయ ఉద్యోగి ఎంపిక


కేదార్‌నాథ్

ఉరవకొండ రూరల్: మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన వాల్మీకి కేదార్‌నాథ్ అనంతపురంలో సచివాలయ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నారు. డీఎస్సీ–2025 మెరిట్ జాబితాలో స్కూల్ అసిస్టెంట్ బయాలాజికల్ సైన్స్ విభాగంలో జిల్లా స్థాయిలో పదో ర్యాంక్ సాధించాడు. ఉద్యోగం చేస్తూ, ఇంటి వద్దనే డీఎస్సీకి సన్నద్ధమైనట్లు కేదార్‌నాథ్ తెలిపారు. ఇన్నాళ్లు పడిన కష్టానికి ఫలితం దక్కిందని తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

బెళుగుప్ప: విరుపాపల్లి, హనిమరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. హనిమరెడ్డిపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడు అర్జున్ ఉచితంగా కోచింగ్ ఇవ్వడంతో పాటు మెటీరియల్‌ను ఆయా పాఠశాలల హెచ్ఎంలు శ్రీనివాసుమూర్తి, మహబూబ్‌ఖాన్ పంపిణీ చేశారు. అర్జున్‌ను పీసీ కమిటీ చైర్మన్లు నాగరాజు, రాజు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

యోగా మాస్టర్‌కు సిల్వర్ పతకం


సిల్వర్ పతకాన్ని అందుకుంటున్న సుబ్బరాయుడు

బొమ్మనహాళ్: రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్–2025 పోటీల్లో బొమ్మనహాళ్ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న యోగా మాస్టర్ సి.సుబ్బరాయుడుకు సిల్వర్ పతకం వరించింది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పత్తిపాడులోని సరస్వతి విద్యాలయంలో 6వ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. సీనియర్ విభాగంలో లెగ్ బ్యాలెన్స్ వ్యక్తిగత యోగా ఈవెంట్‌లో సిల్వర్ పతకాన్ని సాధించారు. ఏపీ, తెలంగాణ యోగాసన బార్ జాతీయ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నందనం కృపాకర్, స్టేట్ ప్రెడిసెంట్ డాక్టర్ రాధిక చేతులు మీదుగా సిల్వర్ పతకాన్ని అందుకున్నారు. సుబ్బరాయుడుకు యోగా మాస్టర్ సిల్వర్ మెడల్ అందడంపై ప్రిన్సిపాల్ హనుమంతనాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

దేవదాయశాఖ స్థలం ఆక్రమణ


టీడీపీ నాయకుడు ఆక్రమించుకున్న దేవదాయశాఖ స్థలం

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట క్రాస్ సమీపంలో దేవదాయ భూమిలో కొంత స్థలాన్ని ఓ టీడీపీ నాయకుడు ఆక్రమించుకొని ఇల్లు నిర్మించుకుంటున్నాడు. గ్రామ సమీపంలో సర్వే నంబర్ 98లో ఉన్న ఆంజనేయస్వామి భూమిని కొందరు ఆక్రమించుకొని యథేచ్ఛగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునేవారులేరని గ్రామస్తులు మండిపడుతున్నారు. దేవదాయశాఖ అధికారులకు తెలియచేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయంపై దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డిని అడగ్గా, క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎవరైనా స్థలాన్ని ఆక్రమించుకుని ఉంటే తొలగిస్తామని చెప్పారు.

మారెమ్మ పండుగ ప్రశాంతంగా జరుపుకోండి

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో మంగళవారం జరిగే మారెమ్మ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. మారెమ్మ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ఎలాంటి గొడవలు లేకుండా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

రాయదుర్గంటౌన్: పట్టణంలో మంగళవారం నుంచి జరిగే దుగ్గిలమ్మ ఆలయం వద్ద పారిశుధ్య, రోడ్డు చదును పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప సోమవారం పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, బషీర్ అహ్మద్, గోని శ్రీరామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్‌తో కలిసి పరిశీలించారు.

‘వరుస’కట్టిన రోగాలు

- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వాస్పత్రి
- దగ్గు, జలుబు, జ్వరం కేసులే అధికం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు


ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో ఓపీ చీటీల కోసం భారీగా క్యూ కట్టిన రోగులు


వైద్యుల కోసం వేచి ఉన్న దృశ్యం

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ హయాంలో వైద్య రంగానికి పెద్దపీట వేశారు. పల్లెల్లోనే అన్ని వర్గాల వారికీ కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. అందుకు పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోలేదు. వైద్యసేవలు సక్రమంగా అందడంలేదు. ఫలితంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఎక్కడ చూసినా జ్వర బాధితులే కనిపిస్తున్నారు. ఉరవకొండ 50 పడకల ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. దగ్గు, జలుబు, జ్వరం బారిన పడి అత్యధిక మంది ఆస్పత్రికి వస్తుండటంతో రోగులతో ఆసుపత్రి ప్రాంగణం కిటకిటలాడుతుంది. వాతావరణలో మార్పులు, పారిశుధ్యం లోపించడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఉరవకొండ పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాలైన వజ్రకరూరు, విడపనకల్లు మండలాల నుంచి ఉరవకొండ ఆసుపత్రికి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

‘వరుస’కట్టిన రోగులు..

జలుబు, దగ్గు, జ్వరం బారిన పడి పిల్లలు, పెద్దలు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలివస్తుండటంతో ఓపీ చీటీల కోసం ఉదయం 7గంటల నుండే క్యూలైన్లు దర్శమిస్తున్నాయి. వివిధ గ్రామాల నుంచి పేద, మధ్య తరగతి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. గత రెండు వారాలుగా ఓపీ 400 నుంచి 500 కు చేరింది. సాధారణ సమయాల్లో 300 నుంచి 350 వరకు నమోదు అవుతుండగా, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ఓపీ సంఖ్య పెరిగింది.

వేధిస్తున్న వైద్యుల కొరత:

ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సరిపడా డాక్టర్లు లేరు. దీంతో వైద్య సేవలు కుంటుపడుతున్నాయి. ప్రస్తుతం ఒక మెడికల్ ఆఫీసర్‌తో పాటు గైనిక్, అనిస్తీషియా, మరో ముగ్గురు వైద్యులు మాత్రమే ఉన్నారు. రోగుల సంఖ్య తగట్టుగా మరో ముగ్గురు వైద్యులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన సేవలందిస్తున్నాం

వాతావరణంలో మార్పు వల్ల ఓపీ సంఖ్య పెరిగింది. జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతూ ఆస్పతిరకి వస్తున్నారు. రోగులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటు న్నాం. సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేస్తున్నాం.ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ ఎస్‌వీఎస్ చౌదరి, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఉరవకొండ

ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు


మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

రాయదుర్గం: మారెమ్మ, వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో విఘ్నాలు తొలగిపోయి, సకల శుభాలు కలగాలని, విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు.

మట్టి ప్రతిమలనే పూజిద్దాం..

రంగు రంగులతో తయారైన వినాయకుడి విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుందని, మట్టి ప్రతిమలనే ప్రతి మంటపం, ఇంట్లో పూజిస్తూ పండుగ సంప్రదాయాన్ని ప్రజలంతా పాటించాలని మెట్టు పిలుపునిచ్చారు. రంగులపై మోజుపడి వినాయక ప్రతిమలు కొనుగోలు చేస్తే పర్యావరణ కాలుష్యాన్ని కొనితెచ్చుకున్నట్లేనని ఆయన హెచ్చరించారు. ప్రజలందరికీ మారెమ్మ, వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

జోడు లింగాలకు పూజలు

కూడేరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన స్వయంభు జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతులు సోమవారం ప్రత్యేక పూజలందుకున్నారు. ఆలయ అర్చకులు శివశంకర్ శాస్త్రి, మహేష్, శివ స్వాములు రుద్రాభిషేకం క్షీరాభిషేకం చేశారు. ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని 19 వార్డులో కార్యకర్తలో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం కోసం నూతన కమిటీని ఎన్నుకున్నారు. తలారి రంగయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ 6 పథకాలు అర్హత లేకున్నా టీడీపీ వారికే అందుతున్నాయన్నారు. అర్హత ఉన్నా కూడా పేద, మధ్య తరగతి వారికి అందడం లేదన్నారు. కూటమి అధికారంలోకొచ్చిన తర్వాత దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణమన్నారు. నియోజవర్గ వ్యాప్తంగా మద్యం ఏరులై పారుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, కౌన్సిలర్లు పూసల భాగ్యమ్మ, లక్ష్మన్న, పరమేశ్వరప్ప, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి నరేంద్రరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, కన్వీనర్లు ఈడిగ సుధీర్, గోళ్ల సూరి, హనుమంతురాయుడు, జిల్లా కోఆర్డినేటర్ ఎర్రంపల్లి కృష్ణమూర్తి, పార్టీ సీనియర్ నేత మాజీ మండల కన్వీనర్ తిరుమల వెంకటేశులు, మున్సిపల్ కోఆప్షన్ ఆఫ్జల్, మండల జేసీఎస్ కన్వీనర్ అంజి, నాయకులు దొడగట్ట మురళి, బోరంపల్లి రామిరెడ్డి, బిక్కిహరి, షేక్షావలి, మారుతి, జాకీర్, సురేష్, పాండు, హరి, పాతలింగ, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజలకు మేలు చేసే గుణం చంద్రబాబుకు లేదు’

శెట్టూరు: ప్రజలకు మేలు చేసే గుణం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు అన్నారు. సోమవారం మండలంలోని కై రేవులో ‘రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో’ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం, జగనన్న ఇచ్చిన హామీలు ప్రజలకు ఏవిధంగా ఇచ్చారనే అంశాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్ల గంగాధర, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు శెట్టూరు తిప్పేస్వామి, ప్రతాప్, హనుమంతరాయుడు, శ్రీరాములు, మహాలింగ పాల్గొన్నారు.


కైరేవులో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

గ్రామ కమిటీ ఎంపిక : అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా ఈడిగ జయన్న, ఉపాధ్యక్షుడు గంగాధర రెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

పంట నష్ట పరిహారం ఇంకెప్పుడిస్తారు ?

- ‘కూటమి’ తీరుపై మండిపడిన మాజీ ఎమ్మెల్యే మెట్టు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: పంట నష్టపోయిన ప్రతి రైతుకూ సకాలంలో పరిహారం ఇప్పిస్తామని గత ఎన్నికలప్పుడు హామీ ఇచ్చారు..ఆ హామీకి అతీగతీ లేదు.. రైతులంటే ఎందుకు చులకన ? పరిహారం ఇంకెప్పుడిస్తారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులును వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి నిలదీశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివ, పట్టణ, డి హీరేహాళ్, రాయదుర్గం, కణేకల్లు మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, రవీంద్రనాథ్‌రెడ్డి, రామాంజనేయులు, బ్రహ్మానందరెడ్డితో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడారు.

కూటమి పాలనలో అడుగడుగునా అన్యాయమే..

అకాల వర్షాలు, ఈదురు గాలుల దెబ్బకు రబీ సీజన్‌లో హెచ్ఎల్‌సీ ఆయకట్టుతో పాటు బోర్ల కింద సాగు చేసిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలు వేలాది ఎకరాల్లో దారుణంగా దెబ్బతిన్నాయి.. కోతకొచ్చిన సమయంలో పంట మొత్తం తుడిచిపెట్టుకుపోయిందని మెట్టు అన్నారు. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతుల్ని పరామర్శించే కార్యక్రామనికి శ్రీకారం చుట్టామని, ఆ మైలేజీ తమకే దక్కాలనే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ముందు రోజు పర్యటించారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా పారదర్శకంగా ఎరువుల పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో యూరియా కొరతతో రైతులు అల్లాడుతుంటే కణేకల్లు మండలం బెణకల్లులో లోడు యూరియా టీడీపీ నాయకుడి ఇంట్లో దించడం, ఎర్రగుంటలో టీడీపీ వాళ్లకే పంచిపెట్టడం దారుణమన్నారు. హెచ్ఎల్‌సీ పరిధిలో 31 వేల ఎకరాలు కేవలం వరి సాగైతే ఎకరాకు రెండు బస్తాలన్నా 62 వేల బస్తాల యూరియా అవసరమవుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలులో అర్హులకు అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. రూ.20 వేలు ఇవ్వాల్సిన చోట కేంద్రం నిధులు కలుపుకుని కేవలం రూ.5,500తోనే సరిపెట్టారని సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. ఇంతదానికి విజయోత్సవాలు నిర్వహించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేసిన ర్యాలీలో ఓ రైతు గాయపడ్డాడన్నారు. పంట ఏదీ పండినా సరైన మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇది కూటమి ప్రభుత్వ వైఫల్యమేనని మండిపడ్డారు. ఒక్క రాయదుర్గం నియోజకవర్గంలోనే సుమారు వెయ్యికి పైగా దివ్యాంగుల పింఛన్లు కోత పెట్టే పరిస్థితి కనిపిస్తోందన్నారు. రైతులు, దివ్యాంగులకు అన్యాయం చేయాలని చూస్తే పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెన్న, నాయకులు నాగలాపురం అంజిరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రచారం విభాగం జిల్లా క్యాదర్శి కెంగోటి రామిరెడ్డి, బీసీసెల్ జిల్లా కార్యదర్శి హళ్లి నాగరాజు, మైనార్టీసెల్ జిల్లా కార్యదర్శి బషీర్, వడ్డే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పీఏబీఆర్‌లోకి తగ్గిన ఇన్‌ఫ్లో


పీఏబీఆర్‌లో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం)లోకి ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ ఫేజ్–2కు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేశారు. దీంతో పీఏబీఆర్‌లోకి కేవలం 483 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఇంతకు ముందు 1672 క్యూసెక్కులు వచ్చేవి. హెచ్చెల్సీ ద్వారా 72 క్యూసెక్కుల నీరు చేరుతోంది. సోమవారం నాటికి డ్యాంలో 4.386 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం ఇరిగేషన్ అధికారులు తెలిపారు. సత్యసాయి, శ్రీరామరెడ్డి, అనంతపురం, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు, నీటి ఆవిరి, లీకేజీల రూపంలో రోజుకు సుమారు 130 క్యూసెక్కులు వదులుతున్నారు.

వినాయక ఉత్సవాల్లో డీజేలు పెడితే చర్యలు


మాట్లాడుతున్న రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ

బొమ్మనహాళ్: వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ఎక్కడైనా డీజేలు పెడితే కఠిన చర్యలు తప్పవని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ కోరారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో తహసీల్దార్ మునివేలు, విద్యుత్ ఏఈ లక్ష్మీరెడ్డి, ట్రైనీ ఎస్ఐ నవీన్‌కుమార్‌తో కలిసి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్కడా డీజేలు పెట్టరాదన్నారు. నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని, మంటపాల వద్ద భద్రత కల్పించేందుకు నిర్వాహకులు వలంటీర్లను నియమించుకోవాలన్నారు.

కుందుర్పి: గణేష్ ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ ఓబులేసు, ఇన్‌చార్జ్ ఎస్ఐ లోకేష్ తదితరులు హెచ్చరించారు. గణేష్ స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం సాయంత్రం మండలంలోని వివిధ గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులతో గణేష్ ఉత్సవాల నిర్వహణపై వివరించారు. కేవలం మూడు రోజులు మాత్రమే విగ్రహాలకు అనుమతి ఉంటోందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమేష్, డీటీ తిప్పేస్వామి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో సత్తాచాటిన పేదింటి బిడ్డలు


రాహుల్ సాయి


మీనుగ వెన్నెల

శెట్టూరు: నీట్ ఫలితాల్లో పేదింటి విద్యార్థి జే.రాహుల్ సాయి సత్తాచాటాడు. ఇటీ వల విడుదలయిన మొ దటి విడత నీట్ ఫలితాల్లో శెట్టూరు గ్రామానికి చెందిన ఏఎన్ఎం వన్నూరక్క కుమారుడు రాహుల్ సాయి మంచి ర్యాంకు సాధించాడు. శ్రీ బాలజీ మెడికల్ కాలేజీ రేణిగుంటలో మెడికల్ సీటు సాధించాడు. నీట్ పరీక్షలు దగ్గర పడిన సమయంలో తన తల్లిని కోల్పోయినా .. కుంగిపోకుండా పరీక్షలు రాసి మంచి ర్యాంకుతో తల్లి కోరిక నెరవేర్చాడు. మండల వ్యాప్తంగా తోటి విద్యార్థులు, బంధువులు, గురువులు రాహుల్ సాయికి అభినందనలు తెలియజేశారు.

ఉరవకొండ అమ్మాయి ఎంబీబీఎస్ సీటు

ఉరవకొండ: స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు రాజు, శ్యామల దంపతుల కుమార్తె మీనుగ వెన్నెల ఎంబీబీఎస్ సీటు సాధించింది. 2025 మే 4న జరిగిన నీట్ పరీక్షా ఫలితాల్లో 440 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో 5,115వ ర్యాంకు సాధించింది. ఎస్సీ కేటగిరిలో వెన్నెల కడప రిమ్స్ వైద్యశాలలో సీటు సాధించింది. దళిత కుటుంబానికి చెందిన వెన్నెల ఎంబీబీఎస్ సీటు సాధించడంతో కాలనీవాసులు అభినందించారు.

వజ్రకరూరు సర్పంచుకు సత్కారం


మోనాలిసాకు మెమెంటో అందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ శివ్‌నారాయణశర్మ

వజ్రకరూరు: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వజ్రకరూరు సర్పంచు మోనాలిసాను కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివ్‌నారాయణ శర్మ తదితరులు అభినందించారు. ఇటీవల భారత నాణ్యత మండలి ఆధ్వర్యంలో దేశంలోని సర్పంచులకు ఆన్‌లైన్‌లో నిర్వహించే సర్పంచ్ సంవాద్ పోటీల్లో మోనాలిసా జాతీయ స్థాయిలో జూలై మాసానికి మొదటి స్థానంలో నిలిచి, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయత్ అనే అంశంపై తన ఆలోచనలను పంచుకుని రూ.35 వేల నగదు బహుమతికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రోహార్, ఐసీడీఎస్ పీడీ నాగమణి, సీడీపీఓ శ్రీదేవి తదితరులు ఉన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో గొడవ

కళ్యాణదుర్గం: బోరంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య తలెత్తిన చిన్నపాటి ఘర్షణ ఒకరినొకరు కొట్టుకునే స్థాయికి వెళ్లింది. ఈ ఘటన సోమవారం కళాశాలలో చోటు చేసుకుంది. పాలిటెక్నిక్ కళాశాలలో మధ్యాహ్న సమయంలో జూనియర్లు, సీనియర్లకు మధ్య చిన్న గొడవ జరిగింది. జూనియర్ విద్యార్థిని, సీనియర్ కొట్టాడు. దీంతో అందరి ముందు ఒకరినొకరు కొట్టుకున్నారు. కళాశాల సిబ్బంది ఇద్దరినీ వారించారు. ఈవిషయం జూనియర్ విద్యార్థి పేరెంట్స్‌కు తెలియడంతో వారు కళాశాలకు వచ్చి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. గొడవకు కారణమైన సీనియర్ విద్యార్థిని కొట్టినట్లు సమాచారం. దీనిపై ప్రిన్సిపాల్ తిప్పేస్వామిని అడగ్గా , ఇద్దరు విద్యార్థుల మధ్య చిన్నపాటి గొడవ అని, దీనిపై ఓ విద్యార్థి పేరెంట్స్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించబోమని, మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే సహించేదిలేదని స్పష్టం చేశారు.

కొరవడిన పర్యవేక్షణ: కళాశాల విద్యార్థులపై యాజమాన్యం పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంటోందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు చెప్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కళాశాలకు పంపుతుంటే మధ్యాహ్నం సమయానికే మద్యం సేవించడం, ధూమపానం చేయడం వంటి వాటికి అలవాటు పడినట్లు స్థానికులు చెప్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలంలోని శివరాంపేట సమీపంలో అనంతపురం– బళ్లారి ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బళ్లారికి చెందిన భీమలింగ, గోవిందప్ప గాయపడ్డారు. ద్విచక్ర వాహనంపై బళ్లారికి వెళ్తుండగా తీరా ఘటనాస్థలం వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా కారు రావడంతో అదుపుతప్పి లారీకి తగిలి కిందపడ్డారు. గాయపడిన ఇద్దరూ ఉరవకొండ ఆస్పత్రిలో చికిత్స పొందారు.

నేడు దుగ్గిలమ్మ జాతర

- రేపు సిడిమాను ఉత్సవం
- ఆలయాల్లో పూర్తయిన ఏర్పాట్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 17వ వార్డులో వెలసిన దుగ్గిలమ్మ జాతరకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి. సోమవారం సాయంత్రానికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనానికి ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు. ఏటా జరిగే దుగ్గిలమ్మ జాతరకు రాయదుర్గంతోపాటు పరిసర గ్రామాల నుంచే కాక కర్ణాటక నుంచి వేలాదిగా భక్తులు హాజరవుతారు. భక్తుల ఇలవేల్పుగా దుగ్గిలమ్మ దేవతకు పూజలు చేసి, మొక్కులు తీర్చుకోవడం ఇక్కడ ఆనవాయితీ. అనేక మంది జంతుబలి ఇస్తారు. వేపాకు కొమ్మలు ధరించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. దుగ్గిలమ్మ జాతర అనంతరం మరుసటి రోజు బుధవారం పట్టణంలోని ఫైర్ స్టేషన్ వద్దనున్న మారెమ్మ ఆలయంలో పూజలు, సిడిమాను ఉత్సవం నిర్వహిస్తారు.

నేడు, రేపు దండుమారెమ్మ ఉత్సవం

రాయదుర్గంలోని నేసేపేట 6వ వార్డులో వెలసిన దండు మారెమ్మ ఉత్సవం మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంగ పూజ జరగ్గా, మంగళవారం అమ్మవారి ఉత్సవం, బుధవారం సిడిమాను ఉత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు మారెమ్మదేవి ఉత్సవాలు

కుందుర్పి: మండల కేంద్రంలో మారెమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.ఏటా భాద్రపద మాసం మొదటి మంగళవారం అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇప్పటికే ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ రామూర్తి తెలిపారు. ఉదయం అమ్మవారికి హోమం, కుంకుమార్చన, మధ్యాహ్నం గ్రామశాంతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.


రాయదుర్గం: దుగ్గిలమ్మ ఆలయం వద్ద పూర్తయిన ఏర్పాట్లు

నేడు గౌరసంద్ర మారెమ్మ వార్షికోత్సవం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని గౌరసంద్ర మారెమ్మ దేవత వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఏటా అమ్మవారి వార్షికోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ప్రస్తుత వార్షికోత్సవ పూజల్లో భాగంగా ధ్వజారోహణం, కండోల స్వీకార పూజలు నిర్వహించనున్నారు. పూజలనంతరం అమ్మవారి ప్రభ ఊరేగింపు ఉంటుంది. ఉత్సవంలో భాగంగా అన్నప్రసాద వితరణ, రాత్రికి భజన కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.